నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 30 మార్చి 2024 | MAHABUBNAGAR NARAYANPET




కొలిమికుచ్చత ండాస మీపంలో ఎండిన వరి పంటను గొర్రెలకు వదిలేసిన రైతులు

# గొర్లకు వరి పైరు మేత

- తగ్గిన భూగర్భజలం..ఎం డుతున్నపం టలు
- 500 ఫీట్లు బోరు వేసినా చుక్కనీరు రాకపాయే..

మహ్మదాబాద్, మార్చి 29 : బోర్లలో భూగర్భ జలాలు అడుగంటడంతో వరి పైర్లు ఎండుముఖం పట్టాయి. ఎప్పటిలాగే పంటలు పండుతాయనే నమ్మకంతో రైతులు ఈ యాసంగిలో బోర్ల కింద వరి పంట సాగు చేశారు. రోజురోజుకూ బోర్లలో నీరు తగ్గుతుండడంతో భూమి నెర్రెలు బారి పంటలు ఎండుతున్నాయి. కొంతమంది రైతులు పంటలు ఎండకుండా ఎంత లోతైనా సరేనంటూ కొత్తగా బోర్లు వేసుకుంటున్నారు. 500 ఫీట్లు వేసినా చుక్కనీరు రావడం లేదు.. అరకొరా వచ్చినా 2 ఇంచులకు మించి నీరు రావడం లేదు. మరి కొందరు రైతులు చేసేదేమీ లేక ఎండుతున్న పంటలను చూసి మదనపడుతున్నారు. మండలంలో 4,800 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేశారు. ఇప్పటికే నీళ్లు సరిపోక 50 శాతం పంటలు ఎండిపోయాయి. ఉష్ణోగ్రతలు ఇంకా పెరిగితే 60-70 శాతం పంటలు ఎండిపోయే అవకాశం ఉందని వ్యవసాయఅ ధికారులుఅ ంచనా వేస్తున్నారు.

ఎండుతున్న పంటలను చూసి రైతులు గత్యంతరం లేక తమ పశువులను పొలాల్లో మేపుతున్నారు. మరికొందరు పంటను ముందుగా నే కోసి పశువులకు మేతగా వేస్తున్నారు. రూ.వేల పెట్టుబడి పెట్టి వరి పైరు సాగు చేస్తే బోర్లలో నీరు తగ్గడంతో మండల రైతులు ఆవేదన చెందుతున్నారు.

### మూడు బోర్లు వేసినా నీళ్లు పడలేదు..

మా సొంత పొలంలో మూడెకరాలు వరి, నాలుగెకరాల్లో ఇతర పంటలు సాగు చేసినం. బోర్లలో మొదట్ల నీరు బాగానే వచ్చింది. రానురానూ నీరు తగ్గి రోజుకో బందం చొప్పున వరి పంట నెర్రెలు పారుకుంట వచ్చింది. రెండు మూడు కొత్త బోర్లు వేసినా నీళ్లు పడలేదు. ఏడెకరాల పంట కండ్ల ముందే ఎండిపోతుంటే చూడలేక పశువులను మేపుతున్నం. ఎండిన పంటకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.


*- కొడిగంటి సాయిలు, రైతు, మొకర్లబాద్*



ఎండిన వరి పంటను మేస్తున్న పశువులు, గొర్రెలు

# పశువుల పాలైన పెట్టుబడి

కొత్తకోట, మార్చి 29 : ఎండలు ముదరడంతో బోర్లల్లో నీటిమట్టం తగ్గుతున్నది. క్రమంగా పంటలు ఎండిపోతుండడంతో రైతులు చేతికొచ్చిన పంటను పశువులు, గొర్రెలకు వదిలిపెడుతున్నారు. పట్టణ సమీపంలోని వడ్డెవాట రోడ్డులో తనకున్న ఎకరా పొలంలో అప్పు చేసి వరి పంట వేశాడు మద్య మోని వెంకటయ్య.. ఇటీవల బోరులో నీరు తగ్గడంతో చేసేదేమీ లేక పశువులకు మేపుతున్నాడు. రూ.20వేల అప్పు చేసి పంటను సాగు చేస్తే నీళ్ల లేక పశువులకు మేపాల్సి వచ్చిందని రైతు వాపోయాడు.



గుమ్మకొండలో వరి పంటను మేస్తున్న పశువులు


# పైర్లకు అందని నీరు

తిమ్మాజిపేట, మార్చి 29 : వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి పంట పశువులకు మేతవుతున్నది. తిమ్మాజిపేట మండలం గుమ్మకొండలో యాసంగిలో సాగు చేసిన వరి పైర్లకు నీళ్ల లేక ఎండుతున్నాయి. దీంతో రైతులు గుండె రాయి చేసుకుని పశువులను తోలుతున్నారు. గ్రామంలో పాలమూరు-రంగారెడ్డి ప్రధాన కాల్వ పక్కనే వరి సాగు చేయగా.. కాల్వలో నీళ్ల లేక.. బోర్లు వట్టిపోవడంతో రైతు పోలా భాస్కర్ తన పొలంలోకి పశువులను తోలాడు. ఊళ్లో చాలామంది రైతులది ఇదే పరిస్థితి అని అతడు వాపోయాడు.


### ఎండిన పంటలకు పరిహారమివ్వాలి..

పంటలు ఎండిపోతాయని ఊహించలేదు. నాకున్న మూడు బోర్లలో నీళ్లు లేక రెండెకరాల పంట ఎండిపోయింది. చేసేది లేక పశువులకు మేపుతున్నా. పెట్టుబడికి చాలా ఖర్చయ్యింది. ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటే రైతు కుటుంబాలు బతుకుతయి. లేదంటే అప్పుల పాలై రోడ్డున పడి బతుకులు ఆగమైతయ్.

*- మన్యంనాయక్, తిమ్మాయిపల్లి తండా, అడ్డాకుల మండలం*



ఎండుతున్న వరి పంటను పశువులకు వదిలినమ న్యంనాయక్



జడ్చర్ల మండలం దేవునిగుట్టతండాలో నీళ్లలేక నెర్రలుబారిన వరి పొలం

## కానరాని నీళ్లు..

# రైతన్న కన్నీళ్లు

మూసాపేట, మార్చి 29 : రోజురోజుకూ ఎండలు పెరుగుతుండడంతో చెరువులు, వాగులు ఎండిపోయాయి. బోరుబావుల్లో సైతం భూగర్భజలాలు అడుగంటాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో ఎండిపోతుండడంతో రైతన్నకు గుండెకోత మిగులుతున్నది. అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తండాలో చేతికొచ్చిన వరి పంటలు సాగునీళ్లు అందక నెర్రెలుబారుతున్నాయి. తండాకు చెందిన రైతు మన్యంకు నాలుగెకరాల భూమి ఉన్నది. అందులో నాలుగు బోర్లు ఉండగా మూడెకరాల్లో వరి సాగు చేశాడు. 15 రోజుల్లో పంట చేతికి రానుండగా బోర్ల నుంచి నీళ్లు రాక కండ్లముందే ఎండిపోతుంటే చూడలేక రెండెకరాల పంటను పశువుల మేతకు వదిలేశాడు. మిగిలిన ఎకరాకు రాత్రీపగలు తేడా లేకుండా నీళ్లు పారబెడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో రైతు శంకర్‌నాయక్‌కు నాలుగెకరాల భూమి ఉన్నది. అతనికి రెండు బోర్లు ఉండగా రెండెకరాల్లో వరి పంట సాగు చేశాడు. కాగా రెండు బోర్లలో జలం అడుగంటి సన్నగా ఆగి ఆగి పోస్తుండడంతో పారిన మడే పారుతున్నది. దీంతో ఎకరం పంట ఎండిపోయింది. రెండు బోర్లనుంచి నీరు పారించినా పొలానికి పారడం లేద ని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 15 రోజులైతే పంట చేతికొచ్చేదని వాపోతున్నాడు.



### చి'వరి' దశలో నీరందడం లేదు..

చంద్రబాబు పాలనలో పంటలు ఇట్లే ఎండిపోయి పూర్తిగా నష్టపోయాం. మళ్లీ ఇప్పుడు పంటకు తడి కోసం తండ్లాడుతున్నం. కేసీఆర్ పాలనలో గత ఎండాకాలంలోనే ఇప్పుడున్న రెండు బోర్లతో నాలుగెకరాలు పండించిన. కానీ ఇప్పుడు రెండెకరాలు సాగు చేస్తేనే చివరి దశలో ఎకరానికి నీరు అందక ఎండిపోయింది. మిగిలిన ఎకరానికి తడి పెట్టడానికి రాత్రీపగలు ఇక్కడే పడిగాపులు కాస్తున్నా. ఎండిన పంటకు ప్రభుత్వం నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలి. లేదంటే రైతాంగం ఆగమైతది.

*- శంకర్‌నాయక్, రైతు, తిమ్మాయిపల్లితండా, అడ్డాకుల మండలం*

### అడుగంటిన ఆశలు..

జడ్చర్ల, మార్చి 29 : యాసంగిలో వరి పంటలకు నీళ్లలేక నెర్రెలుబారి ఎండిపోతున్నాయి. గతేడాది యాసంగిలో నీళ్ల పుష్కలంగా ఉండటంతో పంటలు బాగా పండాయి కానీ.. ఈ ఏడాది వానకాలంలో వర్షాలు అంతంతమాత్రంగానే కురవడంతో చెరువుల్లోకి నీరు చేరలేదు. భూగర్భజలాలు అడుగంటిపోయి బోరుబావుల్లోంచి నీరు రావడం లేదు. దీంతో వేసిన వరి పైర్లు ఎండిపోతున్నాయి. యాసంగి ప్రారంభంలో బోర్లలో నీళ్లు పుష్కలంగా ఉండడంతో రైతులు అధిక మొత్తంలో వరి సాగు చేశారు. తీరా కలుపు తీసే సమయానికి నీళ్ల తగ్గి పంటలు పూర్తిగా ఎండిపోయే దశకు చేరుకున్నాయి. పంట చేతికొచ్చేందుకు ఇంకా రెండునెలల సమయం ఉండడంతో ఆశలు అడుగంటాయి.

వరి పైర్లకు నీరందక కండ్లముందే నెర్రెలుబారి ఎండుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగు ఖర్చులు తడిసి మోపెడయ్యాయని, అప్పులు తెచ్చి సాగు చేసిన పం టలు మధ్యలోనే ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో వాటిని పశువులకు మేపుతున్నారు. వరి సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

- వట్టిపోయిన కాల్వలు, చెరువులు, కుంటలు
- నోళ్లు తెరిచిన పొలాన్ని చూసి అన్నదాత ఆవేదన
- తడి కోసం ఆరాట పడుతున్న కర్షకులు
- కండ్ల ముందే ఎండిపోతున్న పంటలు
- దిక్కుతోచని స్థితిలో మూగజీవాలకు మేతగా వదిలేస్తున్న వైనం



జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి గ్రామం సమీపంలో నెర్రెలుబారిన వరి పొలం





మరికల్‌లో పట్టుబడినన గదునుచూ పుతున్న సీఐ రాజేందర్‌రెడ్డి, అడ్డాకుల టోల్‌గేట్ వద్ద పట్టుబడినన గదుతో ఎస్సై శ్రీనివాసులు

# అనుమతి లేకుంటే నగదు సీజ్

- ఎన్నికల వేళ రూ.50 వేలకు మించితీ సుకుపోవద్దు..
- హెచ్చరిస్తున్న పోలీసులు
- పలు చోట్లతని ఖీలు

మరికల్, మార్చి 29 : ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న రూ.8.40లక్షలను సీజ్ చేసినట్లు మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. బీరప్ప అనే వ్యక్తి దేవరకద్ర మండలం గురకొండ నుంచి మక్తల్ మండలం జక్లేర్‌కు బైక్‌పై రూ.8.40లక్షలు తీసుకెళ్తున్నాడు. మండలంలోని లాల్‌కోట చౌరస్తా వద్ద పోలీసులు శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో నగదును పట్టుకున్నారు. సరైన పత్రాలను చూపకపోవడంతో డబ్బులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. అనుమతులు లేకుండా రూ.50వేలకు మించి డబ్బులు తరలిస్తే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. సరైన ఆధారాలు లేకుండా నగదు తరలిస్తూ పట్టుబడి ఇబ్బందులు పడొద్దని ఆయన సూచించారు.

**బుద్ధారం గండి వద్ద రూ.1.90లక్షలు..**

గోపాల్‌పేట, మార్చి 29 : మండలంలోని బుద్ధారం గండి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. బిజినేపల్లి మండలం లింగసానిపల్లికి చెందిన సత్యనారాయణ కారులో వనపర్తికి వెళ్తుండగా బుద్ధారం చెక్‌పోస్టు వద్ద ఎస్సై హరిప్రసాద్‌గౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అతడి నుంచి రూ.లక్షా 90వేలు లభించగా సరైన ఆధారాలు చూపించలేదు. దీంతో నగదును సీజ్ చేశారు.

**టోల్‌ప్లాజా వద్ద రూ.1.16లక్షలు..**

మూసాపేట(అడ్డాకుల), మార్చి 29 : అనుమతి లేకుండా తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. అడ్డాకుల మండలం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో కర్ణాటక రాష్ట్రం హోస్పేటకు చెందిన ఆదిల్ నవాజ్ కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీ చేశారు. రూ.1.16 లక్షల నగదు లభించగా అందుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసి ట్రెజరీకి పంపినట్లు తెలిపారు.

# ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

- నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు
- భక్తులతో స్నేహభావంతో మెలగాలి
- శ్రీశైలం ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మార్చి 29 : ఉగాది ఉత్సవాలకు వచ్చే భక్తులతో స్నేహభావంతో మెలగాలని ఆలయ ఈవో పెద్దిరాజు దుకాణాదారులకు సూచించారు. శుక్రవారం పరిపాలనా భవనంలో ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, ఎస్సై నవీన్‌బాబు, ఏఈవో మల్లికార్జునరెడ్డితో కలిసి ఆయన దుకాణాదారులతో సమావేశమై మాట్లాడారు. కన్నడ భక్తులతో భాషాపరమైన సమస్యలు తలెత్తకుండా వాణిజ్య సముదాయాల వద్ద కన్నడ సేవా సంస్థల ప్రతినిధులను ఏర్పాటు చేస్తామన్నారు. వ్యాపారులు వస్తువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు ఆలయ వ్యాపార లైసెన్స్, లీజు అగ్రిమెంట్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రధానంగా హోటల్ నిర్వాహకులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, వాణిజ్య సముదాయాల్లో యాత్రికులకు అర్థమయ్యేలా తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.




దుకాణాదారులతో మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

# గద్వాలలో పెట్రోలింగ్ నిర్వహించాలి

- భయాందోళనకుగు రవుతున్నప్రజ లు
- వరుస చోరీలపై ఎమ్మెల్యే బండ్లఅ సహనం
- దొంగతనాలనుఅ రికట్టాలని ఎస్పీకి ఆదేశం

గద్వాల, మార్చి 29 : జిల్లా కేంద్రంలో జరుగుతున్న వరుస చోరీలపై ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఈనెలలో ఎస్వీ ఈవెంట్ హాల్‌లో 30తులాల బంగారం చోరీ జరిగిన ఘటన మరువక ముందే గురువారం లింగంబాగ్ కాలనీకి చెందిన ఇంగూరి వెంకటేశ్వర్లశెట్టి ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. రూ.10లక్షల నగదుతోపాటు 50 తులాల బంగారం అపహరణకు గురైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్పీ రితిరాజ్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో తరచూ భారీ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, ఇంటిని వదిలి ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించి చోరీలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ శ్రీనివాసులు, నాయకులు ఈశ్వరయ్య, నర్సింహులు ఉన్నారు.



బాధితకు టుంబసభ్యులతో మాట్లాడుతున్నఎమ్మెల్యేబ ండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# అవసరమైతే బోర్లను లీజుకు తీసుకుంటాం

- నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు : ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైతే రైతుల బోర్లను లీజుకు తీసుకుంటామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పేర్కొన్నారు. కరువు దృష్ట్యా ఇంటింటికీ సరఫరా అవుతున్న నల్లా నీటిని పొదుపుగా వాడుకోవాలని, అప్పుడే నీటిఎద్దడి నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. వనపర్తిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా వేసవిలో నీటి సరఫరాపై శుక్రవారం విలేకరులతో సమావేశమై మాట్లాడారు. ప్రస్తుతం డిమాండ్‌కు సరిపడా నీటి సరఫరా అవుతున్నదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి నీటి వృథాను అరికట్టాలని, నీరు పట్టుకున్నాక కుళాయి బంద్ చేయాలన్నారు. అలా కాకుండా బాత్‌రూంలో, మురికి కాల్వల్లోకి నల్లా పైపును వేయడం వల్ల నీరు వృథా అవుతుందన్నారు. వాహనాలు, ఇండ్ల శుభ్రం పేరుతో నీటిని దుర్వినియోగం చేయరాదని కోరారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో ప్రస్తుతం ఉన్న నీటి డిమాండ్, సరఫరా అవుతున్న వివరాలను వెల్లడించారు. అత్యధికంగా నీటి సమస్య ఉన్న గ్రామాల్లో బోర్లను లీజుకు తీసుకునేలా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. అడ్వాన్స్‌గా డబ్బులు చెల్లించేందుకు కూడా ఇబ్బంది లేదని, నీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు కిరణ్‌కుమార్, ఖమ్మర్ మియా, యాదయ్య, వేణు, రాములు, బాబా, జాను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్నప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడుచి న్నారెడ్డి

# 31న జిల్లా స్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నీ

మహబూబ్‌నగర్‌టౌన్, మార్చి 29 : జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31న మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో జిల్లాస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రవికుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు పోటీలను డీఎస్పీ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.